క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్రీయ పోషణ మాసం

కలువాయి(సైదాపురం): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సువర్ణ తెలిపారు. అధికంగా చక్కెర వాడడం, నూనె వాడకం తగ్గించడం, బాల్యదశలో పోషణ ఆహారం, చదువువంటి విషయాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు.

ఫస్ట్ ర్యాంకర్‌కు సత్కారం



చిట్టమూరు: డీఎస్సీలో 2025 ఫలితాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో 100 మార్కులకు 93 సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన రాయి.సాయికోటిని మంగళవారం ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని అరవపాళెం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాయి కోటిని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి బీవీ రమణయ్య, ఎంఈఓలు బీవీ కృష్ణయ్య, భూపయ్య సత్కరించారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



గూడూరురూరల్ : పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, పట్టణ, వెస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని రీజియన్ చైర్మన్ డాక్టర్ బి.కృష్ణమూర్తి, జోనల్ చైర్మన్ డాక్టర్ టి.శ్రీరంజని ప్రారంభించారు. వారు రూ.10వేలు నగదును టైలరింగ్ క్యాంప్ చైర్మన్ రవీంద్రరెడ్డికి అందజేశారు. నిరుపేదలకు సరుకులను పంపిణీ చేశారు.

ఓజిలి ఎంపీడీఓగా నారాయణరెడ్డి

ఓజిలి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. త్వరలో ఎంపీడీఓ బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఏఓ అమృతవాణి తెలిపారు.

కలువాయి ఎంపీడీఓగా శైలజ

కలువాయి(సైదాపురం): మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారిగా శైలజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఉండే సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని, ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచుతానని తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు సుప్రజ

రాపూరు: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పశువైద్యులు టీకాలు వేస్తున్నారని పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని పశువైద్యులు అనిల్‌కుమార్, సుప్రజ తెలిపారు. మండలంలోని తెగచర్ల, గిలకపాడు మంగళవారం పశువులకు టీకాలు వేశారు. మండలంలో అక్టోబర్ 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో టీకాలే వేయనున్నట్లు తెలిపారు. తెగచర్ల గ్రామంలో 630, గిలకపాడులో 591పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.

నేటి నుంచి మెగా వైద్యశిబిరాలు

రాపూరు: మండలంలో బుధవారం నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు మెగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రమీల రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఉంటాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వృక్షాలతోనే మనుగడ

గూడూరురూరల్ : వృక్షాలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జగద్గురు శ్రీమాధవాచార్య సంస్థానం ట్రస్టీ శ్రీ విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ పిలుపునిచ్చారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర డీమ్డ్ టు బీ యూనివర్సిటీని మంగళవారం సాయంత్రం ప్రారంభించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెళ్లకూరు: వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు శ్రీకాళహస్తికి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో తాళ్వాయిపాడు గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు		17-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	150
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	264
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	290
లేయర్ చికెన్	:	195



బురదగుంటలతో నిండిన జూమానుగుంట గిరిజన కాలనీ రోడ్డు



అధ్వాన్నంగా ఉన్న భీమవరం గ్రామానికి వెళ్లే రోడ్డు



కంకరరాళ్లు తేలి ఉన్న కిష్టప్పకండ్రిగ రోడ్డు

గ్రామీణ రోడ్లు.. బురదగుంటలు

పట్టించుకోని పాలకులు, అధికారులు

పెళ్లకూరు: మండలంలోని పల్లెలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, మండల కేంద్రాలకు వెళ్లేందుకు రోడ్లు సక్రమంగా లేకపోవడంతో పల్లె జనం అవస్థలు పడుతున్నారు. మొత్తం 24 పంచాయతీల్లో 56 కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్, 68 కిలోమీటర్ల దూరం ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ రోడ్ల మొత్తంలో కేవలం 12కిలోమీటర్లు బీటీ, 5 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేశారు. మిగిలిన 39 కిలోమీటర్లు పంచాయతీ రోడ్లన్నీ గుంతలు ఏర్పడి కంకర రాళ్లు తేలడంతో ప్రయాణం కష్టతరమైంది. పలు ప్రాంతాలకు ఆర్టీసీ సౌకర్యం కూడా లేదు. ముఖ్యంగా యడపూడి, నందిమాల, కిష్టప్పకండ్రిగ, జూమానుగుంట, గంగరాజుకండ్రిగ, యాలకారికండ్రిగ, కప్పగుంటకండ్రిగ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉన్నాయి. దాంతో అత్యవసర సమయాల్లో 108, 104 వాహనాలు కూడా ముఖం చాటేస్తున్నాయి.

గత ప్రభుత్వంలో నందిమాల, పునబాక, భీమవరం, ఆర్లపాడు గ్రామాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేశారు. దిగువకానూరు, కలవకూరు, చింతపూడి, పాలచ్చూరు గ్రామాలకు వెళ్ల రోడ్లన్నీ లోతైన గుంతలతో అధ్వాన్నంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకు యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ, జూమానుగుంట, కిష్టప్పకండ్రిగ, రావులపాడు, భీమవరం, చింతపూడి, పసుపుకండ్రిగ, ఆర్లపాడు, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడవడంలేదు.



బురదగుంటలతో నిండిన బంగారంపేటకు వెళ్లే రోడ్డు

గిరిజన కాలనీల రోడ్ల దుస్థితి

మండలంలోని పలు గిరిజన కాలనీలకు వెళ్లే రోడ్లు లోతైన గుంతలు, ముళ్లచెట్లు కమ్మేసి, చినుకు పడితే రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. జూమానుగుంట, కిష్టప్పకండ్రిగ, పాలచ్చూరు గ్రామాల్లోని గిరిజన కాలనీలకు వెళ్లే రోడ్లన్నీ లోతైన గుంతలతో దారుణంగా ఉన్నాయి. దశాబ్దాలుగా రోడ్ల మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో తేలికపాటి వర్షానికి బురదమయంగా మారుతున్నాయి. రోడ్ల దుస్థితి వల్ల ఇక్కడి గిరిజనులు అత్యవసర సమయాల్లో పట్టణాలకు చేరుకోవడానికి అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. దాంతో దశాబ్దాలుగా ఆయా గిరిజన కాలనీలకు 104, 108 వాహనాలు వచ్చి వెళ్లిన దాఖలాలు లేవు.

రోడ్డును అభివృద్ధి చేయాలి



“ ఇరవైయేళ్లుగా అభివృద్ధి పనులకు నోచుకోకుండా అధికారుల తప్పిదం వల్ల ఒక్క పైసా కేటాయించలేని పరిస్థితి నెలకొంది. కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరుకు వెళ్లే బీటీ రోడ్డు వాహనాల రాకపోకలతో లోతైన గుంతలు ఏర్పడి మట్టి రోడ్డుగా దర్శనమిస్తుంది. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

– మద్దాల సోమశేఖర్‌రెడ్డి, పాలచ్చూరు

దశాబ్దాలుగా మట్టి రోడ్డే



కలవకూరు పంచాయతీ పరిధిలోని యడపూడికి అనకవోలు గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ ఊరికి దశాబ్దాలుగా మట్టి రోడ్డు మీదుగా ప్రయాణం సాగించాల్సిన దుస్థితి. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఇక్కడ రోడ్డు దుస్థితిపై పట్టించుకునేవారు లేరు. గ్రామంలోని సామాన్య జనం కాలినడకతో ఇతర ప్రాంతాలకు చేరుకోవాల్సిందే.

– కృష్ణారెడ్డి, పిడికిటిమాల గ్రామం

జెండా ఉత్సవానికి అనుమతి తప్పనిసరి



జెండా ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గూడూరురూరల్ : మైసూరు తరువాత ప్రసిద్ధి గాంచిన ఆంజనేయస్వామి జెండా ఉత్సవానికి కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జెండా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న ఆదివారం రాత్రి నిర్వహించనున్న దసరా ప్రారంభ వేడుకైన ఆంజనేయస్వామి జెండా ఉత్సవంలో డీజేలు వినియోగించవద్దని, బాణసంచా కాలచ్చరాదని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సకాలంలో ఊరేగింపు పూర్తి చేయాలని సూచించారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌తో జీవనోపాధి



మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

చిల్లకూరు: ఫ్యాషన్ డిజైన్ కోర్సు పూర్తి చేసుకున్న స్వయం జీవనోపాధితో ముందడుగులు వేయవచ్చని సునీత సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న సంస్థ కార్యాలయంలో మూడు నెలల పాటు శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను అందించారు.

అర్ధరాత్రి వర్షం.. రైతులకు తీవ్ర నష్టం



వర్షపు నీరు చేరిన పొలంలో వరి కోత కోస్తున్న మిషన్



వరి ధాన్యం లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

చిట్టమూరు: మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఎడగారు రైతులు అవస్థలు పడ్డారు. ఎడగారులో ముమ్మరంగా కోతలు జరుగుతున్న తరుణంలో రాత్రి సమయంలో కుండపోత వర్షానికి కల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. మరో పక్క కోత కోసే పొలంలో నీరు చేరడంతో కోత కోసేందుకు ఇబ్బందులు పడ్డారు. వరి పైరు పూర్తిగా తడిసిపోవడంతో వడ్ల గింజలు పొలంలోనే రాలిపోయాయని రైతులు చెబుతున్నారు. ధరలు చూస్తే అంతంత మాత్రమే ఉండడంతో వర్షం కురుస్తుండడంతో ధాన్యం ధరలు దళారులు అమాంతం గా తగ్గించేశారు. వారం రోజులు ముందు పుట్టి(860 కేజీలు) రూ.15,500 ఉండగా మంగళవారం నాటికి పుట్టి రూ.13,500కు దళారులను బతిమాలుకుని అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోయారు. దిగుబడి కూడా తగ్గడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలియజేశారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



చిట్టమూరు: క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, అధికారులు

చిట్టమూరు: మండల పరిధిలోని అరవపాళెం జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి క్రీడా పోటీలను వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య మంగళవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయి పోటీలలో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీలలో అథ్లెటిక్స్, వాలీవాల్, కబ్బడీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చదరంగంలో మండలంలోని 9 పాఠశాలల నుంచి సుమారు 460 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

శ్రీవారి సేవలో పూజిత



వేదపండితుల ఆశీర్వాదం అందుకుంటున్న పూజిత

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని మంగళవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఏసీ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లూరు శివకుమార్‌రెడ్డి, గోనుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఉపాధి కూలి అందక అవస్థలు

కోట: ఉపాధి హామీ పనులు చేస్తున్నా వేతనాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు గూడలి గ్రామానికి చెందిన మహిళలు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఎంపీడీఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. నెలల తరబడి కూలీ బకాయిలు అందని పరిస్థితి నెలకొందన్నారు. కష్టపడి ఉపాధి పనులకు వెళుతున్నా వేతనాల చెల్లింపులపై అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఫిర్యాదు చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



రణభేరి ర్యాలీ ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నేతలు

వెంకటగిరి రూరల్/సూళ్లూరుపేట/నాయుడు పేటటౌన్: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో యూటీఎఫ్ రణభేరి బైక్ ర్యాలీ ప్రారంభించారు. తిరుపతిలో బయల్దేరిన యూటీఎఫ్ రణభేరి వెంకటగిరి, శ్రీకాళహస్తి మీదుగా సూళ్లూరుపేట, నాయుడుపేటకు చేరుకుంది. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, జిల్లా సహాయ అధ్యక్షులు కుమార స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

కోట: మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను మంగళవారం అగ్రికల్చర్ విజిలెన్స్ ఏఓ రామాంజనేయ రెడ్డి తనిఖీ చేశారు. గ్రోమోర్, బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్ ఆధారంగా నిల్వలను పరిశీలించారు. యూరియాను అధిక ధరలకు అమ్మడం, అనధికారికంగా స్టాక్ చేయడం, యూరియా కొరత సృష్టించడం వంటివి చేస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ సుచేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోండి



జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ తనురాజ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత డక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి మృతికి రెండు నిమిషాలపాటు మౌనం వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తుమ్మూరు మస్తాన్ మాట్లాడుతూ అమ్మపాళెం పంచాయతీలో వ్యవసాయశాఖ అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తున్నట్లు తెలిపారు. రైతులకు యూరియా, ఎరువులను, విత్తనాలను పంపిణీ చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. పాళెంకోట సర్పంచ్ వేణు రెడ్డి మాట్లాడుతూ తమ పంచాయతీ కొండక్రింద ప్రాంతం కావడంతో పశువులు అధికంగా ఉన్నాయని, అయితే పశువైద్యాధికారి మాత్రం లేరని వాపోయారు. ఉపసర్పంచ్ భూపతి సుధాకర్ మాట్లాడుతూ రైతుల అవసరాలను అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుణశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు, ఉద్యోగులు

గూడూరురూరల్ : గూడూరు ఆర్టీసీ డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్)47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులు కామ్రేడ్ డి.మల్లికార్జున ఎస్‌డబ్ల్యూఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా యూనియన్‌ను స్థాపించినట్లు తెలిపారు. అనంతరం డిపో మేనేజర్ పి.సి.హెచ్.లక్ష్మి చేతుల మీదుగా మొక్కలు నాటారు.

వాకాడు: ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో కార్మికులు, ఉద్యోగులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ, కార్మికులు యూనియన్ జెండాను డిపో ఆవరణలో ఎగరవేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

పట్టణ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ నిఘా



డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణ పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు సీఐ ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణంలోని ఐఐహెచ్‌టీ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ పలు ప్రాంతాలను చిత్రీకరించి, నిఘా ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణం, పరిసర ప్రాంతాల్లో ప్రజలు భద్రత, అనుమానస్పద కదలికలపై నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు వైన్ షాపుల ఫీజులు చెల్లించాలి

వాకాడు : వాకాడు సర్కిల్ పరిధిలో ఉన్న వైన్ షాపుల నిర్వాహకులు ఈ నెలాఖరు లోపు ఆయా షాపులకు సంబంధించి ఫీజులు చెల్లించాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి తెలిపారు. ఆయన మంగళవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌తో కలసి వాకాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. శ్రీనివాసాచారి మాట్లాడుతూ వాకాడు సర్కిల్ పరిధిలో 17 బ్రాందీ షాపులు ఉన్నాయన్నారు. మొదటి సంవత్సరం పూర్తి కావడంతో రెండో సంవత్సరం ఫీజుతోపాటు షాపుల పక్కన ఉన్న పర్మిట్ రూమ్‌కు వైన్ షాపు యజమానులే ఫీజులు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు.

రుణాలు వినియోగించుకోండి

దొరవారిసత్రం : బ్యాంకుల నుంచి పొదుపు సంఘం సభ్యులు తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకుని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు అడిషనల్ పీడీ ప్రభావతి అన్నారు. డీవీ సత్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం 1,756 పశువుల కొనుగోలుపై గ్రూపు సభ్యులు, బ్యాంకర్లు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశువుల కొనుగోలు నిమిత్తం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి సభ్యుల జీవనోపాధి మెరుగు పరిచేందుకు వెలుగు ప్రాజెక్ట్ కృషి చేస్తుందన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట

కోట: మండలంలోని చిట్టేడులో రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను మంగళవారం వేడుకగా నిర్వహించారు. చిట్టేడుకు చెందిన నాగేంద్ర ఆచార్య మఠం, చిదానంద ఆశ్రమం ఆధ్వర్యంలో వేదమంత్రాలతో అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారి విగ్రహానికి భక్తులు హారతులు పట్టారు. ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

నివాళి

నాయుడుపేటటౌన్: దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన ఇండస్ట్రియల్ అధికారి కన్నాలి తిరుపాలయ్య తల్లి పద్మమ్మ మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పట్టణంలోని వారి నివాసానికి చేరుకుని పద్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించార. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

చెత్తసేకరణ తనిఖీ



దొరవారిసత్రం : మండలంలోని ఏకొల్లు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణపై మంగళవారం డీఎల్‌డీఓ జాలిరెడ్డి తనిఖీ చేశారు. ఆయన పారిశుధ్యం కార్మికులు చెత్త సేకరించే విధానం పరిశీలించడంతో పాటు సంపద తయారీ కేంద్రం నిర్వహణను తనిఖీ చేశారు. పారిశుధ్యం మెరుగు పరచడం, తాగునీటి నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చారు. ఆయన వెంట ఎంపీడీఓ గోవర్ధన, పంచాయతీ కార్యదర్శకులు నాగరాజు ఉన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష కేంద్రం తిరుపతి జిల్లా చెందిన వ్యవసాయ అధికారులు పుష్పావతి, కల్యాణ్‌బాబు, స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి సుజాత ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ, బయో ఫర్టిలైజర్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.